క్లుప్తంగా

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు (కిలో రూపాయల్లో...) టమాటా 20, పచ్చిమిర్చి 45 , బెండ 40, కాకర 50, దొండ 40, దోస 30, ఆలు 25, చామ 50, కీర 30, బీర 50, వంకాయ 50, గోకర 50, బీన్స్ 100, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 25, క్యారెట్ 50, చిక్కుడు 80, ఉల్లి 30 (1 కేజీ), ములక్కాయలు (1) 10 , క్యాలీఫ్లవర్ (1) 40, సొరకాయ (కేజీ) 30, అల్లం 160, వెల్లుల్లి 160.

నేడు ఓల్డ్ లింగంపల్లిలో బస్తీ దవాఖానా ప్రారంభం

శేరిలింగంపల్లి: డివిజన్ పరిధిలోని ఓల్డ్ లింగంపల్లి విలేజీలో బస్తీదవాఖానాను సోమవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ ప్రారంభిస్తారని కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తెలిపారు. నాణ్యమైన వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువలోకి తీసుకొచ్చేందుకు ఈ బస్తీదవాఖానాను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ వైద్య సేవలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ముగిసిన హ్యాండీ క్రాఫ్ట్స్ ఉత్సవ్ 2023



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న గుజరాత్ హ్యాండీ క్రాఫ్ట్స్ ఉత్సవ్ 2023 ఆదివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. డాక్టర్ వినీల రావు శిష్యబృందంచే కూచిపూడి నృత్యప్రదర్శన, సందర్శకులను అలరించింది. ఇందులో నర్తన గణపతిం, ధన్యకైలాస్, హంస, నందిని తిల్లాన, శివాష్టకం, కొలువైతివా, శంకరశ్రీగిరి, నారాయణీయం, ఆనందతాండవం తదితర అంశాలను కళాకారులు షాలిని, ప్రవల్లిక, శ్రీనిధి, అలేఖ్య, ధరణి, వైష్ణవి, సంయుక్త తదితరులు ప్రదర్శించారు.

పందెం కోళ్ల పెంపకం స్థావరాలపై దాడులు

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోగల శ్రీరాంనగర్ కాలనీలో పందెం కోళ్ల పెంపకం స్థావరాలపై ఎస్‌ఓటీ అధికారులు ఆదివారం దాడులు నిర్వహించారు. దాడుల్లో రూ.1.39 లక్షల నగదు, 49 సెల్ ఫోన్లు, ఆరు పందెం కోళ్లు, 53 మంది బెట్టింగ్ రాయుళ్లు, నిర్వాహకులను ఎస్‌ఓటీ ఎస్‌ఐ రోహిత్‌కుమార్ అదుపులోకి తీసుకున్నారు. బొల్లారం సీఐ నయీముద్దీన్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్యవైశ్యులకు అన్ని పార్టీలు టికెట్లు ఇవ్వాలి

మణికొండ: వచ్చే శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో ఆర్యవైశ్యులకు అన్ని పార్టీలు టికెట్లు కేటాయించి అవకాశం కల్పించాలని మణికొండ వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓలం యాదగిరి కోరారు. ఆదివారం తమ అసోసియేషన్ కార్యవర్గసభ్యుల సమావేశాన్ని మణికొండలో నిర్వహించారు. ఏ పార్టీలు ఆర్యవైశ్యులకు అవకాశం కల్పిస్తే ఆ పార్టీ గెలుపునకు కృషి చేస్తామన్నారు. ఆర్యవైశ్యులకు జనాభా ప్రాతిపదికన ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలను ఇవ్వాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలపై ఉందన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ కేంద్రాల పరిశీలన

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బతుకమ్మ చీరల సెంటర్ల పంపిణీ కేంద్రాలను జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్ అధికారి రాధా రాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమె మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలోని 5 డివిజన్‌లలో 60 సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ సెంటర్ల నుంచే బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్నామని వివరించారు. ఆదివారం సెలువుదినమైనా.. చీరలను పంపిణీ చేశామని, అన్ని సెంటర్ల ద్వారా 1500 చీరలను పంపిణీ చేశామన్నారు.

ఆర్థిక సహాయం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని 3వ బ్లాక్‌లో నివాసం ఉండే మొయిన్ నివాసంలో అగ్ని ప్రమాదం జరిగింది. బాధితులకు పీఎస్ ఫౌండేషన్ చైర్మన్ బూరుగడ్డ రాకేష్ రాజ్ ఆదివారం నిత్యావసర సరుకులు, రూ.10 వేల నగదు ఆదివారం అందజేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బూరుగడ్డ నగేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

దోభీఘాట్ నిర్మాణానికి శంకుస్థాపన

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని ఊట్లలో ధోబీ ఘాట్ నిర్మాణం చేపట్టారు. ఆదివారం వైస్ ఎంపీపీ గంగు రమేష్, సర్పంచ్ ఆంజనేయులు, ఉపసర్పంచ్ రవి, మాజీ సర్పంచ్ శివరాజ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిర్మాణం త్వరగా పూర్తి చేయించేలా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తెలిపారు.

పేదల సొంతింటి కల

నెరవేరిన వేళ !



నల్లగండ్లలో 'డబుల్' ఇళ్ల మంజూరు పత్రాలను అందిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు, ఎమ్మెల్యే గాంధీ (ఫైల్)

- నల్లగండ్లలో 216 'డబుల్' ఇళ్ల నిర్మాణం
- 2017లో శంకుస్థాపన.. 2023లో నిర్మాణం పూర్తి
- లబ్ధిదారులకు అందించిన డిప్యూటీ స్పీకర్ పద్మారావు, ఎమ్మెల్యే గాంధీ



నల్లగండ్ల వద్ద నిర్మించిన డబుల్ బెడ్ రూమ్‌లు

శేరిలింగంపల్లి: ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న పేదల సొంతింటి కల ఎట్టకేలకు నెరవేరింది. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో మొదటి సారిగా నల్లగండ్లలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడం విశేషం. ఆరేళ్లుగా అప్పుడు.. ఇప్పుడు అంటూ నిర్మాణం సాగదీసినప్పటికీ.. ఎట్టకేలకు పూర్తి చేయడంతో లబ్ధిదారుల కుటుంబాల్లో సంతోషం వెల్లివిరిసింది. ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రత్యేక చొరవతో నిర్మాణం పూర్తై లబ్ధిదారులకు అందాయి. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు డిప్యూటీ స్పీకర్ పద్మారావు ఎమ్మెల్యే గాంధీ చేతుల మీదుగా అందించారు. తాము ఒక్క రూపాయి చెల్లించకుండా పూర్తిగా ఉచితంగా ఇళ్లు అందించడంతో పేదల సంతోషానికి అవధులు లేకుండా పోయింది.

నల్లగండ్ల డబుల్ ఇళ్ల వివరాలు:

- 2017 నవంబర్ 11న నల్లగండ్లలో డబుల్ బెడ రూమ్ ఇళ్లకు నగర మేయర్ బొంతు రామ్మోహన్ చేతుల మీదుగా శంకుస్థాపన
- 2018 డిసెంబర్‌లో పూర్తి చేయాలని సంకల్పించారు.
- 1.58 ఎకరాల్లో రూ.18 కోట్లు వ్యయంతో 216 ఫ్లాట్ల నిర్మాణం
- సీప్లస్ జీప్లస్ 9 పద్ధతిలో ఈ ఫ్లాట్స్ నిర్మించారు.

ఎంతో సంతోషంగా ఉంది



ఎన్నో ఏళ్ల మా సొంతింటి కల నెరవేరింది. మేము పేదలం. స్థలం కొనడం, ఇళ్లు కట్టుకోవడం చాలా కష్టమనే భావనతో ఉన్నాం. కానీ ప్రభుత్వ చొరవతో మాకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయడం ఎంతో సంతోషంగా ఉంది. ఇళ్లు లేని పేదలందరికీ ఈ ఇళ్లు నిర్మాణం చేసి ఇవ్వాల్సిన అవసరం ఉంది.

–మాదపాటి సౌజన్య, 'డబుల్' ఇంటి లబ్ధిదారు

దశల వారీగా అర్హులందరికీ 'డబుల్' ఇళ్లు



శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అర్హులందరికీ దశల వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయిస్తాం. నల్లగండ్లలో 216 ఇళ్లను నిర్మించాం. కొల్లూరులో మూడు విడతల్లో ఇప్పటి వరకు 2,819 మంది లబ్ధిదారులకు డ్రా ద్వారా ఇళ్లను అందించాం. శేరిలింగంపల్లిలో కూడా వీటి నిర్మాణం కోసం ప్రణాళిక రూపొందించాం. లబ్ధిదారుల్లో దివ్యాంగులు 70 మంది, ఎస్సీలు 479, ఎస్టీలు 169, ఇతరులు 2,101 మంది ఉన్నారు. ఒక్క పైసా ఖర్చు లేకుండా పేదవారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుంది. నిరాశ్రయులైన కొందరికి కూడా ఇళ్లను కేటాయించాం.

–ఆరెకపూడి గాంధీ, ఎమ్మెల్యే శేరిలింగంపల్లి

జర్నలిస్టుల ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ



చందానగర్‌లో జర్నలిస్టుల ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ మంజుల

హఫీజ్‌పేట్: రెండున్నర దశాబ్దాల జర్నలిస్టుల కల నెరవేరే రోజు వచ్చిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ అన్నారు. ఆదివారం శేరిలింగంపల్లి మండలంలో జర్నలిస్టుల కోసం కేటాయించిన స్థలంలో ఇళ్ల నిర్మాణానికి స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డితో కలిసి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ, చందానగర్ సర్వే నెంబర్ 174లోని ప్రభుత్వ భూమిలోని ఒక ఎకరం స్థలం శేరిలింగంపల్లి జర్నలిస్టుల కోసం కేటాయించడంతో సొంతింటి కల సాకారమైందని అన్నారు. టీయూడబ్ల్యూజే, ఐజేయూ నాయకులు ఇళ్ల స్థలాలు కేటాయించాలని పలుమార్లు తనను కోరారని అన్నారు. ఈ విషయాన్ని తాను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘాల నాయకులు మాట్లాడుతూ, శేరిలింగంపల్లి జర్నలిస్టుల ఇళ్ల నిర్మాణం కోసం స్థలం కేటాయించడానికి కృషి చేసిన ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల తరఫున ముఖ్యమంత్రి కేసీఆర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్‌ల నేతలు మారుతిసాగర్, శ్రీనివాస్ గౌడ్, మాధవ్‌రెడ్డి, శేఖర్ సాగర్, రమేష్ సాగర్, విఠల్‌రెడ్డి, రాజిరెడ్డి, తిరుపతిరెడ్డి, జగన్‌రెడ్డి, శేరిలింగంపల్లి మండల జర్నలిస్టులు పాల్గొన్నారు.

వాచ్‌మన్ పిల్లల చదువుకు లయన్స్‌క్లబ్ చేయూత



శేరిలింగంపల్లి: వాచ్‌మన్ పిల్లల చదువుకు లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ హోప్ ఆధ్వర్యంలో చేయూత అందించారు. నల్లగండ్ల ప్రాంతంలో వాచ్‌మన్‌గా పని చేస్తున్న వెంకట్‌రెడ్డి పిల్లలు బిందు, నందకిశోర్ స్థానిక పాఠశాలలో 3, 4 తరగతులు చదువుతున్నారు. పిల్లల చదువు కోసం లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ హోప్ ఆధ్వర్యంలో రూ.20 వేలు అందించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ హోప్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండా విజయకుమార్, అధ్యక్షుడు తోపుగుండ మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, పేదలను ఆదుకోవడమే లయన్స్ క్లబ్ లక్ష్యమని, ఇందులో భాగంగానే వాచ్‌మన్ పిల్లల చదువుకు చేయూత అందించామన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నూకల సందీప్, మధుసూదన్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్, మారం ప్రసాద్ పాల్గొన్నారు.

చర్మ సంరక్షణ ఎంతో అవసరం



దెర్మిక్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ మంజుల అనగాని, యాంకర్ ఓంకార్ తదితరులు

లక్డీకాపూల్: పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న వారు ఎక్కువగా చర్మ వ్యాధులకు గురవుతున్నారని, స్కిన్ కేర్‌పై అప్రమత్తత అవసరమని అరీట్ ఆసుపత్రి డైరెక్టర్, పద్మశ్రీ గ్రహీత డాక్టర్ మంజుల అనగాని చెప్పారు. ఈ నేపథ్యంలో నగరవాసులు చాలా అప్రమత్తతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివారం ఖాజాగూడలో డెర్మిక్ సంస్థ ఏర్పాటు చేసిన ప్రపంచ స్థాయి స్కిన్, హెయిర్ క్లినిక్‌ను ప్రముఖ యాంకర్ ఓంకార్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మంజుల మాట్లాడుతూ, మెడికల్ హబ్‌గా విస్తరించిన నగరంలో చర్మ వ్యాధులకు సంబంధించి అధునాతన శస్త్ర చికిత్సలు కూడా అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ చికిత్సల కోసం ఒకప్పుడు ముంబై, చెన్నై, బెంగళూరు, ఇతర దేశాలకు వెళ్లిల్సి వచ్చేదన్నారు. అత్యాధునిక పరికరాలతో, ప్రపంచ స్థాయి వైద్యం అందించేందుకు డెర్మిక్ సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు డాక్టర్ దీపికా నర్రా, దివ్యశ్రీ, లక్ష్మి దివ్య పాల్గొన్నారు.

కార్మికులకు దసరా బోనస్‌ను ఇవ్వాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య

జిన్నారం(పటాన్‌చెరు): కార్మికులకు దసరా బోనస్‌ను చెల్లించేలా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఖాజీపల్లి పారిశ్రామిక వాడలో కార్మికులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించేలా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలన్నారు. బోనస్ ఇవ్వని పరిశ్రమల వద్ద ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఆయా కార్మిక యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

గ్రీన్ పార్క్‌లో సీసీ కెమెరాలు ప్రారంభం



పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శంతన్ గ్రీన్ పార్క్‌లో ఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్, బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు అంజిరెడ్డి ఏర్పాటు చేశారు. ఆదివారం వీటిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అంజిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శంతన్ గ్రీన్ పార్క్‌లో 300 కుటుంబాలు నివసిస్తున్నాయని, ఈ కాలనీ పట్టణానికి చివరగా ఉండటంతో అసాంఘిక కార్యక్రమాలను జరుగుతున్నాయన్నారు. అటువంటివి జరగకుండా ఉండేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పటాన్‌చెరు అసెంబ్లీ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అదెల్లి రవీందర్, అమీన్‌పూర్ అధ్యక్షుడు ఆగా రెడ్డి, రామచంద్రాపురం డివిజన్ ప్రధాన కార్యదర్శి బలరాం, భారతీనగర్ డివిజన్ ఉపాధ్యక్షురాలు గీత తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామం, నడక అలవాటు చేసుకోవాలి



వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

మియాపూర్: మియాపూర్ ప్రగతి ఎన్‌క్లేవ్‌లోని నీలిమ హైట్స్, గ్రీన్స్‌లో మెడికవర్ ఆసుపత్రి చందానగర్ సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో బీపీ, షుగర్, కంటి, దంత పరీక్షలతో పాటు ఈసీజీ తదితర పరీక్షలను వైద్యులు నిర్వహించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ రోజూ వ్యాయామం, నడక, యోగా వంటివి అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఆదిత్య, రామ్, వింధ్య, కాలనీ వెల్ఫేర్స్ అసోసియేషన్ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, రమేష్, సాంబశివరావు, సీతారాం, రాజేంద్రప్రసాద్, రాహుల్, ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రూ.70 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



మాదాపూర్ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్ల పరిధిలోని హుడా కాలనీ, జనప్రియనగర్ ఫేజ్ 1,5 కాలనీ, గోకుల్ ఫ్లాట్స్‌లో సుమారు రూ.70 లక్షలతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కమ్యూనిటీ హాల్ నిర్మాణం, పార్కు అభివృద్ధి పనులు శ్రీకారం చుట్టామన్నారు. పార్కును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పూజిత, జగదీశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో నగర విద్యార్థుల సత్తా



మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో అర్హత సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న ఎండీ పూర్ణచంద్రరావు

లక్డీకాపూల్: ఇండియన్ ఒలింపియాడ్ క్వాలిఫైయర్ ఇన్ మ్యాథమెటిక్స్ (ఐఓక్యూఎం)లో నగర విద్యార్థులు సత్తా చాటారు. వీరిలో రెసోనెన్స్ స్కూల్ విద్యార్థులు 19 మంది రీజినల్ మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్ (ఆర్ఎంఓ)కి అర్హత సాధించారు. మ్యాథమెటిక్స్ టీచర్స్ అసోసియేషన్ నిర్వహిస్తున్న ఈ ఒలింపియాడ్‌లో ఒకే పాఠశాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం చాలా అరుదైన విషయమని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెసోనెన్స్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు అన్నారు. దేశవ్యాప్తంగా 47 మంది రెసోనెన్స్ విద్యార్థులు ఆర్ఎంఓకి సెలెక్ట్ అయ్యారన్నారు. దేశవ్యాప్తంగా 4694 మంది విద్యార్థులు అర్హత సాధించగా.. అందులో తెలంగాణ నుంచి 281 మంది విద్యార్థులు ఉన్నారన్నారు.

ఘనంగా యోగానంద్ జన్మదిన వేడుకలు



మియాపూర్: మియాపూర్‌లోని నరేన్ కన్వెన్షన్ హాల్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యోగానంద్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గంగారంలోని హనుమాన్ ఆలయం నుంచి నరేన్ కన్వెన్షన్ హాల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. చందానగర్ ఆంజనేయ ఆలయంలో మహిళలు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అదే విధంగా 25 మందికి కుట్టు మిషీన్లు అందజేశారు. నియోజకవర్గంలోని పలుచోట్ల పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అనంతరం కేక్‌కట్ చేసి యోగానంద్‌ను గజమాలతో సన్మానించారు.

బీఆర్‌ఎస్‌లో యువతకు ప్రాధాన్యం



పార్టీ కండువా వేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: సీఎం కేసీఆర్ నాయకత్వంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువత భారీ సంఖ్యలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ఇసుక బావి, వందనపురి కాలనీలకు చెందిన యువకులు పార్టీ సీనియర్ నాయకుడు ఏనుగు శ్రీనివాస్ రెడ్డి, యువ నాయకుడు ఏనుగు నందివర్ధన్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అంకిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోదీతోనే అభివృద్ధి సాధ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రైతుల అభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అంజిరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోదీ ఇచ్చిన మాట మేరకు నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మోదీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బలరాం, రాములు యాదవ్, కనకరాజు, పెంటా రెడ్డి పాల్గొన్నారు.

పసుపు బోర్డు ఏర్పాటుపై హర్షం

జిన్నారం(పటాన్‌చెరు): నిజామాబాద్‌కు పసుపు బోర్డు మంజూరు చేసినందుకు మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో ఆదివారం పీఎం మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు ఆనంద్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పీఎం మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. కేంద్ర నిధులతో తెలంగాణలో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సాయికిరణ్‌రెడ్డి, శ్రీకాంత్, నాయకులు పాల్గొన్నారు.

వేదంతో పాటు ఆధునిక విద్య అవసరం



మణికొండ: పూర్వం వేదవిద్యను సమాజమే పెంచి పోషిస్తూ.. ఉన్నత సమాజ నిర్మాణానికి దోహదం చేసిందని, ప్రస్తుతం వేద విద్యను ప్రోత్సహించాలని విద్యారణ్యం వేద పాఠశాల స్థాపకులు శశిభూషణ సోమయాజి అన్నారు. యాచారం మండలం, చిప్పలపల్లి గ్రామంలో 7 ఎకరాల సువిశాల స్థలంలో 2015 నుంచి వేద పాఠశాల కొనసాగుతుందన్నారు. విద్యార్థులకు వేదంతో పాటు సామాజిక, సాంస్కృతిక విషయాల పట్ల అవగాహన పెంచాలనే ఉద్దేశంతో ఆధునిక విద్యను అందిస్తున్నామన్నారు. వేద పాఠశాల ప్రస్తుతం తాత్కాలిక భవనాలలో అరకొర సౌకర్యాలతో కొనసాగుతున్నందున నూతన శాశ్వత భవనాలను నిర్మించాలనే ఉద్దేశంతో ఆదివారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మై హోం అవతార్ కమ్యూనిటీహాల్‌లో భవన నిర్మాణ బ్రోచర్‌ను విడుదల చేశారు.